క్లుప్తంగా

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



హెల్మెట్ లేని వారికి పూలు ఇస్తున్న దృశ్యం

కొత్తగూడెంఅర్బన్: ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా ప్రతి ఒక్కరూ పాటించాలని మోటర్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ వెంకటరమణ అన్నారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా ఆటో డ్రైవర్లకు, ద్విచక్రవాహనదారులకు అవగాహన కల్పించారు. హెల్మెట్ లేకుండా ద్విచక్రవాహనం నడిపిన వారికి వినూత్నంగా పూలు ఇచ్చి నిబంధనలు పాటించాలని కోరారు. త్రీటౌన్ ఎస్సైలు, ట్రాఫిక్ ఎస్సై మదార్, ట్రాఫిక్ పోలీసులు పాల్గొన్నారు.

తాగునీరు లేక ఇబ్బందులు



సిబ్బందికి సూచనలు ఇస్తున్న కౌన్సిలర్

కొత్తగూడెంఅర్బన్: పట్టణ పరిధి భజన మందిరం ఎదురుగా కిన్నెరసాని మెయిన్ పైప్‌లైన్ పగిలిపోవడంతో నాలుగు వార్డుల ప్రజలకు మూడు రోజుల నుంచి కిన్నెరసాని నీరు రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ఈ మేరకు గురువారం 35వ వార్డులో పగిలిన కిన్నెరసాని పైప్‌లైన్‌ను వార్డు కౌన్సిలర్ రుక్మాంగధర్ బండారి పరిశీలించి మాట్లాడారు. కిన్నెరసాని నీరు రాకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, యుద్ధ ప్రాతిపదికన పనులు వేగవంతం చేసి పూర్తి చేయాలని సిబ్బంది సూచించారు. నీటి ఇబ్బందులు తలెత్తకుండా వార్డులకు వాటర్‌ట్యాంక్‌లను పంపి నీటి సరఫరా చేయాలని కోరారు.

రీజియన్ పరిధిలోనే పోస్టింగ్ ఇవ్వాలి

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలో ఓవర్‌మెన్ పదోన్నతుల పాలసీలో భాగంగా రీజియన్ పరిధిలోనే పోస్టింగ్ ఇవ్వాలని ఐఎన్‌టీయూసీ కొత్తగూడెం ఏరియా ఉపాధ్యక్షుడు రజాక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఓవర్‌మెన్ అభ్యర్థులు ఆయనకు వినతిపత్రం అందజేయగా మాట్లాడారు. 2016లో జేఎంఈటీలుగా చేరి మైనింగ్ సర్దార్లుగా విధులు నిర్వర్తిస్తున్న వారు ఓవర్‌మెన్ పదోన్నతుల కోసం ఎదురుచేస్తున్నారు. అయితే, తొమ్మిదేళ్లుగా పనిచేస్తున్న ఏరియాల్లోనే నివాసం ఉంటున్నందున పదోన్నతి తర్వాత కూడా అదే ఏరియాలో పోస్టింగ్ ఇవ్వాలన్నారు. చిలక రాజయ్య, జి.నవీన్, వెంకటేశ్, ఎస్‌డీ.జుబేర్ పాషా, కె.హర్షవర్ధన్ పాల్గొన్నారు.

కోతులు, కుక్కల బెడద తప్పించండి

కొత్తగూడెంఅర్బన్: పట్టణంలో కోతుల, కుక్కల బెడద తీవ్రంగా ఉందని తక్షణమే బోన్లు తెప్పించి వాటిని పట్టించి ప్రజలకు రక్షణ కల్పించాలని మున్సిపల్ కమిషనర్ శేషాంజన్‌స్వామిను కోరారు. ఇందిరమ్మ ఇళ్ల సూపర్ చెక్ నిమిత్తం 23వ వార్డులో పర్యటించిన కౌన్సిలర్, సౌత్ సెంట్రల్ రైల్వేబోర్డ్ మెంబర్ వై.శ్రీనివాస్‌రెడ్డి గురువారం కలిసి ప్రజల సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లారు. గతంలో నిధులు మంజూరై పెండింగ్‌లో ఉన్న ఇంటి నంబర్లతో కూడిన వీధి బోర్డులను అన్ని వార్డుల్లో, అన్ని బస్తీలో తక్షణం పెట్టించాలన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు ఎంక్వయిరీ ఆఫీసర్ జి.కృష్ణ, కత్తెర రవీందర్, బండి సుభద్ర, రేణుక, విజయ, లక్ష్మి, లక్ష్మీనారాయణ, గౌస్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా వాలీబాల్ పోటీలు



ఉత్కంఠగా సాగుతున్న పోటీ

ఇల్లెందురూరల్: మండలంలోని కొల్లాపురం గ్రామంలో యంగ్‌స్టార్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మూడు జిల్లాల స్థాయి వాలీబాల్ పోటీలు గురువారం హోరాహోరీగా సాగాయి. తుదివరకు ఉత్కంఠగా సాగిన పోటీల్లో పాల్వంచ మండలం గంగదేవిగుప్ప గ్రామం విజేతగా నిలవగా లచ్చగూడెం, కొల్లాపురం, అశ్వారావుపేట జట్లు ద్వితీయ, తృతీయ, చతుర్థ స్థానాల్లో నిలిచాయి. సీనియర్ ఉపాధ్యాయుడు సుందర్ విజేతలకు ట్రోఫీ, నగదు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పాషా, చీమల రాంమ్మూర్తి, లక్ష్మయ్య, మండల వెంకన్న, ఉపేందర్, బుగ్గ వెంకటేశ్వర్లు, గంట శ్రీను, ఆదినారాయణ, రాంచందర్, యరపతి, మల్లేష్, రాము, భద్రయ్య, గోపాల్, భిక్షం, కోటయ్య, ముత్తయ్య, గోపి పాల్గొన్నారు.

చెత్తశుద్ధితో సత్ఫలితాలు

ఊపందుకున్న బయోమైనింగ్

- శరవేగంగా చెత్త నుంచి ఎరువు తయారీ
- భూమిలోకి ప్లాస్టిక్ చేరకుండా దోహదం



బయోమైనింగ్ యంత్రం ద్వారా శుద్ధి అవుతున్న చెత్త

ఇల్లెందు: ఇల్లెందు డంపింగ్‌యార్డులో మూడు నెలల క్రితం నెలకొల్పిన బయోమైనింగ్ సత్ఫలితాలు ఇస్తోంది. సేకరించిన చెత్త నుంచి ఎరువు తయారు చేయడమే ఈ ప్రక్రియ లక్ష్యం. ప్లాస్టిక్‌ను భూమిలోకి చేరకుండా చెత్తను ఎరువుగా చేసి సాగుకు మొక్కలకు వాడాలని ఇల్లెందు మున్సిపాలిటీలోని డంపింగ్‌యార్డులో 'బయోమైనింగ్‌తో శుద్ధి' కార్యక్రమం చేపట్టారు. జిల్లాలో తొలిసారి ఇల్లెందులోనే ఈ విధానం ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారు. తద్వారా చెత్త నుంచి అవసరమైన వస్తువులను వెలికితీసి వేరు చేస్తున్నారు.

విధానం సాగుతోంది ఇలా..

పట్టణంలోని 24 వార్డుల్లో సేకరించిన చెత్తను డంపింగ్‌యార్డుకు స్వచ్ఛ వాహనాలతో బయోమైనింగ్ ప్లాంట్‌లోకి చెత్తను చేరుస్తున్నారు. ప్రతీ రోజు 50 మెట్రిక్ టన్నుల చెత్త డంపింగ్‌యార్డులకు చేరుతుండగా ఈ ప్రక్రియతో దానిని వివిధ దశల్లో శుద్ధి చేపడుతున్నారు. మట్టి రాళ్లు, గాజు, ప్లాస్టిక్, మెటల్ మండే పదార్థాలు వేరు చేసి ఇళ్ల నుంచి వెలువడిన చెత్తను ఎరువుగా మారుస్తోంది. అయితే ముఖ్యంగా ప్లాస్టిక్ వల్ల అనేక అనర్థాలు ఉన్నందున ప్లాస్టిక్‌ను భూమి పొరల్లోకి చేరకుండా నిరోధించే ప్రయత్నమే ఈ ప్రక్రియగా పేర్కొంటున్నారు. భూమిలో కరిగిపోని వస్తువులను వేరు చేసి ఒక చోటు వేస్తుండగా భూమిలో కరిగిపోయే వాటితో ఎరువును తయారు చేస్తున్నారు.



చెత్త నుంచి తయారైన ఎరువు

మూడు పద్ధతుల్లో..

బయోమైనింగ్ యంత్రం మూడు పద్ధతుల్లో పనిచేస్తుంది. ఈ మూడు పద్ధతుల్లో సాగు యంత్రంకు 13 మోటార్లు రన్ అయితే ప్రక్రియ పూర్తవుతోంది. 43 కేవీ లోడ్ విద్యుత్ వాడకంతో ఎరువు ఉత్పత్తి అవుతోంది. లెగసీ వేస్టు అనే చోట చెత్తను వేస్తే ఎంబీఎఫ్ బెల్ట్ సహాయంతో ట్రోనల్‌లోకి కన్వేయర్ బెల్ట్ ద్వారా చెత్త చేరుతుంది. ఇక్కడి నుంచి చెత్త వేరు చేయటం మొదలవుతుంది. ఆర్‌డీఎఫ్ అనే మిషన్‌లో మట్టి, రాళ్లు, గాజు, పేపర్లు, మెటల్, నిర్మాణ సామగ్రిని వేరు చేస్తుంది. భూమిలో కరిగిపోయ్యే వాటితో ఎరువు తయారు చేస్తోంది. భూమిలో కరిగిపోని వస్తువులను రీ సైక్లింగ్ కోసం తరలించేందుకు ఒక చోట డంప్ చేస్తోంది. సేకరించిన చెత్తను ఈ బయోమైనింగ్ ప్రక్రియ ద్వారా గడిచిన మూడు నెలల్లో సగం వరకు రీ సైక్లింగ్ చేశారు. ఇందుకు 'క్యూబ్ బయో ఎనర్జీ' అనే సంస్థ ముందుకు వచ్చింది. డంపింగ్‌యార్డులో గల ఈ బయోమైనింగ్ యంత్రం ఎరువును అందిస్తోంది. రోజుకు రెండు షిఫ్ట్ ప్రకారం శుద్ధి చేపడుతున్నారు.



శుద్ధి చేస్తున్న యంత్రం

త్వరలో ఎరువు తరలింపు..



ఇల్లెందును స్వచ్ఛ మున్సిపాలిటీగా మార్చటం కోసం ఈ ప్రక్రియను ప్రారంభించాం. గడిచిన మూడు నెలల్లో డంపింగ్‌యార్డులోకి చేరిన చెత్తను రీ సైక్లింగ్ ప్రక్రియ చేపట్టారు. ఇప్పటి వరకు సగం వరకు పూర్తయ్యింది. ఇందులో తయారైన ఎరువులను రైతులకు, పట్టణంలోని పూల మొక్కలకు అందించే అవకాశం ఉంది. త్వరలో ఎరువు తరలింపు కోసం చర్యలు తీసుకుంటాం..

– దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, మున్సిపాలిటీ చైర్మన్

క్రీడలతో మానసికోల్లాసం..

- ఎమ్మెల్యే కోరం కనకయ్య



బ్యాటింగ్ చేస్తూ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కనకయ్య

టేకులపల్లి: క్రీడలు మానసిక ఉల్లాసం, ఆరోగ్యం, స్నేహం, ఐక్యతను పెంపొందించడానికి ఎంతగానో ఉపయోగపడతాయని ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. మండలంలోని కొత్తతండా(జి) మంగ్యతండాలో గురువారం ఏర్పాటు చేసిన కల్లు మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ మ్యాచ్‌ను బ్యాటింగ్ చేసి ప్రారంభించారు. టేకులపల్లి టైగర్స్, తారాచంద్–11 జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో తారాచంద్ 11 జట్టు విజేతగా నిలిచింది. విన్నర్‌కు రూ.25 వేలు, రన్నర్‌కు రూ.15వేలు నగదు, షీల్డు బహుమతి ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సై పోగుల సురేష్, నాయకుడు కోరం సురేందర్, మాలోతు భాస్కర్, తారాసింగ్, ధనలక్ష్మీ, రాజ్‌కుమార్, ఈది గణేష్, సర్దార్, రవి, చందర్‌సింగ్, సాములు, గణేష్, సుదీప్, రమేష్, వాంకుడోత్ హతీరామ్ తదితరులు పాల్గొన్నారు.

ఇల్లెందురూరల్: చదువుతోపాటు క్రీడల్లోనూ యువత రాణించాలని ఎమ్మెల్యే కోరం కనకయ్య ఆకాంక్షించారు. మండలంలోని రాఘబోయినగూడెం పంచాయతీలో సంక్రాంతి సందర్భంగా నిర్వహించిన క్రికెట్ పోటీల్లో విజేతలకు ఎమ్మెల్యే బహుమతులు అందజేశారు. పీఏసీఎస్ డైరెక్టర్ కుమ్సోత్ రాము, మండల రాము మహేష్, మడుగు సాంబమూర్తి, పూనెం సురేందర్, బండి సుధాకర్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రహరీ నిర్మాణానికి శంకుస్థాపన

ఇల్లెందు: పట్టణంలోని మోడల్ మార్కెట్‌కు ఎమ్మెల్యే కోరం కనకయ్య భూమి పూజ చేశారు. ఇల్లెందు మోడల్ మార్కెట్‌లో ఎస్‌డీఎఫ్ నిధులు రూ. 50 లక్షలతో పంచాయతీ రాజ్ శాఖతో జరిగే మోడల్ మార్కెట్ పహరీతో పాటు టైల్స్, ఫ్లంబింగ్ పనులు పూర్తి చేయాల్సి ఉండటంతో తన నిధులు నుంచి రూ. 50 లక్షలు కేటాయించారు. మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, వైస్ చైర్మన్ సయ్యద్ జానీపాషా, కమిషనర్ శ్రీకాంత్, కౌన్సిలర్ పాబోలు స్వాతి, పీఆర్ ఏఈ రాజు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి



బహుమతులు అందుకున్న విజేతలు

పాల్వంచరూరల్: గ్రామీణ ప్రాంతాల్లోని యువకులు క్రీడల్లో ప్రతిభ చూపి రాష్ట్ర, జాతీయస్థాయిలో రాణించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్ పాషా అన్నారు. మండల పరిధి కిన్నెరసానిలోని స్పోర్ట్స్ స్కూల్లో నిర్వహించిన కొమరంభీమ్ క్రికెట్ టోర్నమెంట్ సీజన్ 2 గురువారం ముగిశాయి. ఈ టోర్నమెంట్ జగన్నాథపురం జట్టు ప్రథమ స్థానం, కిన్నెరసాని కొమరంభీం జట్టు ద్వితీయస్థానాన్ని కైవసం చేసుకున్నాయి. ఈ సందర్భంగా విజేతలకు సాబీర్‌పాషా, నాయకులు ముత్యాల విశ్వనాథం బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల, పట్టణ కార్యదర్శులు విసంశెట్టి పూర్ణచందర్‌రావు, అడుసుమల్లి సాయిబాబు, టోర్నమెంట్ నిర్వాహకులు ఉదయ్, ఆరీఫ్, విక్రాంత్, సురేష్, కొంగర అప్పారావు, ఖాసీం, జాంగీరు తదితరులు పాల్గొన్నారు.

అధికారులకు సహకరించాలి



మాట్లాడుతున్న కమిషనర్ శ్రీకాంత్

ఇల్లెందు: సర్వేకు వచ్చే వార్డు అధికారులకు తగు సమాచారం అందజేసి సహకరించాలని, ప్రభుత్వం ప్రకటించిన పలు హామీలు అమలు కోసం ఈ నెల 26 నుంచి గ్రామసభలు నిర్వహిస్తామని, తుది జాబితాను ఆ సభల్లో ప్రకటిస్తామని మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, కమిషనర్ శ్రీకాంత్ వెల్లడించారు. గురువారం ఇల్లెందు మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సభలో లబ్ధిదారుల గుర్తింపునకు వార్డు అధికారులను నియమించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వార్డు అధికారులు తమకు కేటాయించిన ఇళ్లకు వెళ్లి సర్వే నిర్వహిస్తారని, కుటుంబ సమగ్ర సర్వే ఆధారంగా రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల పథకం సర్వే సాగుతుందన్నారు. రేషన్‌కార్డు లేని వారికి సర్వే ఆధారంగా కార్డు అందజేస్తారన్నారు. కోరారు. అభ్యంతరాలు ఉంటే స్వీకరించి తుది జాబితాను రూపొందించటం జరుగుతుందన్నారు. మున్సిపల్ మేనేజర్ అంకుషావళీ, వార్డు అధికారులు, కమ్యూనిటీ ఆర్గనైజర్లు పాల్గొన్నారు.

మహాసభను జయప్రదం చేయండి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

టేకులపల్లి: ఈనెల 20న టేకులపల్లి సేవాలాల్ ఆలయంలో జరిగే ఆటో మోటార్ వర్కర్స్ యూనియన్ (టీయూసీఐ) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మహాసభను జయప్రదం చేయాలని సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాయం వెంకన్న పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం టేకులపల్లిలో మహాసభకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... ప్రధానంగా సింగరేణిలో లాభాలకు కారకులైన బొగ్గు ట్రాన్స్‌పోర్టు చేస్తున్నప్పటి నుండి పనిచేస్తున్న టిప్పర్ డ్రైవర్లకు, సింగరేణి వార్షిక లాభాల్లో ప్రకటించిన కాంట్రాక్టు కార్మికులకు స్పెషల్ ఇన్సెంటివ్ రూ 5వేలు ఇంతవరకు డ్రైవర్లకు ఇవ్వకపోవడం సరికాదన్నారు. కనీస వేతనాలు, సీఎం పీఎఫ్ తదితర చట్టబద్ధహక్కులు అమలుకు డ్రైవర్లు పోరాడాలన్నారు. ఈ కార్యక్రమంలో టేకులపల్లి ఏరియా కార్యదర్శి జరుపుల సుందర్, బ్రాంచ్ కార్యదర్శి గుగులోతు మదార్, తేజావత్ రాహుల్, రాజేష్, గుంపాడి సురేష్, రమేష్, ముజాహిద్, ఎండి.సలీం, గాంధీ, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

నిర్వాసితులకు పునరావాసం కల్పించాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఇల్లెందురూరల్: సింగరేణి ఇల్లెందు ఏరియా జేకే–5 ఓసీ విస్తరణ నేపథ్యంలో నిర్వాసితులకు, ప్రభావిత ప్రాంత ప్రజలకు న్యాయం చేయాలని కోరుతూ 21 పిట్ ఏరియా అఖిలపక్ష కమిటీ గురువారం ఎమ్మెల్యే కోరం కనకయ్యకు వినతిపత్రం అందజేసింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. 21 పిట్ ఏరియా పరిధిలో సర్వే నిర్వహించి 186 ఇళ్లను నిర్వాసితులుగా గుర్తించి ఇళ్లకు నంబర్ కేటాయించిన యాజమాన్యం నేటికీ పరిహారం చెల్లింపుపై స్పష్టత ఇవ్వకపోవడం అన్యాయమన్నారు. నిర్వాసితులకు భూ నిర్వాసిత చట్టం 2013 ప్రకారం పరిహారం చెల్లించాలని, ప్రభావిత ప్రాంతంలో యాజమాన్యం సీఎస్ఆర్ నిధులు ఖర్చు చేసి అభివృద్ధి చేయాలన్నారు. మందమర్రి, శ్రీరాంపూర్ ఏరియాల్లో మాదిరిగా ఏరియాలోనూ సంస్థ ఆవిర్భావం నాటి కార్మికుల వారసులకు ఖాళీ క్వార్టర్లను అప్పగించాలని విజ్ఞప్తి చేశారు. విద్యుత్ యూనిట్ ధర రూ.7 వరకు చెల్లిస్తున్నామని, ఉచిత కరెంటును సరఫరా చేసి తమను ఆదుకోవాలని కోరారు. ఆయా సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని ఎమ్మెల్యే హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు సారయ్య, అబ్దుల్ నబి, మంచాల వెంకటేశ్వర్లు, వద్ల శ్రీను, పూనెం సురేందర్, ఎట్టి హరికృష్ణ, ధనసరి రాజు, సూర్నపాక సత్యనారాయణ, పూనెం మధు, క్లింట్ రోచ్, గూళ్ల మొగిలి, సదరం మహేష్, తేజావత్ లాలు, సదయ్య, సుందర్ తదితరులు పాల్గొన్నారు.

తప్పకుండా.. పక్కనుండాల్సిందే..



ఇల్లెందు: సహజంగా శునకానికి యజమానిపై అమిత విశ్వాసం ఉంటుంది. కానీ అంతే స్థాయిలో తన పెంపుడు కుక్క మీద యజమాని ఇష్టాన్ని ప్రదర్శించాడు. ఏకంగా తన భార్యాపిల్లలతో పాటు కుక్కకు జోలె కట్టి భద్రంగా తీసుకెళ్తున్నాడు. గురువారం ఇల్లెందు– గుండాల మధ్య ప్రధాన రహదారిలో ఓ వ్యక్తి తన బైక్ మీద తన భార్యతో పాటు జోలెలో తన పెంపుడు కుక్కను జాగ్రత్తగా తీసుకెళ్తున్న దృశ్యం ముచ్చటగొల్పింది.

సర్వే పకడ్బందీగా నిర్వహించాలి



ఇల్లెందురూరల్: వాణిజ్య భూమి వివరాలు పరిశీలిస్తున్న ఆర్డీఓ మధు



జూలూరుపాడు: రేషన్‌కార్డుల సర్వే



పాల్వంచరూరల్: నాగారంలో..

ఇల్లెందురూరల్: సంక్షేమ పథకాల అర్హుల జాబితా, సాగులో లేని భూముల సర్వే పకడ్బందీగా నిర్వహించాలని ఆర్డీఓ మధు సూచించారు. మండలంలోని పలు పంచాయతీల్లో గురువారం విస్తృతంగా పర్యటించారు. పలు గ్రామాల్లో సాగులో లేని భూముల సర్వేను ఆయన స్వయంగా పరిశీలించారు. లే అవుట్, కమర్షియల్ కట్టాడాలు, ఇళ్ల నిర్మాణాలు చేపట్టిన స్థలాలు, ప్రభుత్వ అవసరాల కోసం తీసుకున్న భూములను పక్కాగా గుర్తించాలన్నారు. నిబంధనలకు లోబడి సర్వే ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రవికుమార్, ఎంపీడీఓ ధన్‌సింగ్, ఎంపీఓ చిరంజీవి, సిబ్బంది పాల్గొన్నారు.

జూలూరుపాడు: రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాల లబ్ధిదారుల ఎంపికపై మండలంలో సర్వే ప్రారంభమైంది. ఈ మేరకు సమగ్ర ఇంటింటి కుటుంబసర్వే ఆధారంగా రేషన్ కార్డులు లేని ఇంటింటికి పంచాయతీ కార్యదర్శులు వెళ్లి సర్వే చేస్తున్నారు. ఈ సర్వే ఎంపీడీఓ, తహసీల్దార్‌ల పర్యవేక్షణలో కొనసాగుతోంది. ఎంపీఓ తులసిరామ్, పంచాయతీ సెక్రటరీలు, తదితరులు పాల్గొన్నారు. మండలంలోని పాపకొల్లు, జూలూరుపాడు, మాచినేనిపేట (పడమటనర్సాపురం), కాకర్ల క్లస్టర్ల పరిధిలోని రెవెన్యూ గ్రామాల్లో భూముల సర్వే ప్రారంభమైంది. ఈ సందర్భంగా తహసీల్దార్ కె.స్వాతిబిందు మాట్లాడుతూ... సాగుయోగ్యం కాని భూముల సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ ఆదినారాయణ, సీనియర్ అసిస్టెంట్ దేశ్ పాండే, సర్వేయర్ శివకృష్ణ, ఏఈఓలు బి.గోపీక్రిష్ణ, విజయభారతి, సునీత, గౌస్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పాల్వంచరూరల్: ప్రభుత్వ పథకాల లబ్దిదారుల ఎంపిక సర్వేను పారదర్శకంగా నిర్వహించాలని ఎంపీడీఓ కె.విజయభాస్కరరెడ్డి ఆదేశించారు. మండల పరిధిలో నాగారం, దంతలబోరు, బంద్రుగొండ పంచాయతీలో అధికారులు రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల సర్వేను నిర్వహించారు. ప్రభుత్వ పథకాల సర్వేను అధికారులు ఇంటింటికి వెళ్లి క్షుణంగా పరిశీలించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ వెంట ఎంపీఓ బి.నారాయణ, ఏపీఓ పొరండ్ల రంగా, కార్యదర్శి దుర్గారావు పాల్గొన్నారు.

బోర్లు, విద్యుత్ మంజూరుకు కృషి చేయాలి

ఇల్లెందురూరల్: నాలుగు దశాబ్దాలుగా పోడు భూముల్లో కేవలం వర్షాధారంగానే వ్యవసాయం చేసుకుంటున్నామని, బోరు, విద్యుత్ సౌకర్యం మంజూరుకు కృషి చేయాలని కోరుతూ మండలంలోని మొండితోగు గ్రామస్తులు గురువారం ఎమ్మెల్యే కోరం కనకయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. తమకు పట్టాలు ఉన్నాయని, ప్రస్తుతం బోర్లు వేసుకునేందుకు అటవీశాఖ అధికారులు అభ్యంతరం చెబుతున్నారని, బోర్లు వేసుకునేందుకు, విద్యుత్ సరఫరాకు అనుమతులు ఇప్పించాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేశారు. ఉన్నతాధికారులతో మాట్లాడి అనుమతులు మంజూరు చేయిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఇర్ప లక్ష్మయ్య, సుధాకర్, చిరంజీవి, ఏడుకొండలు, విజయ్, కృష్ణ, రాంబాబు, రవి, సంపత్ పాల్గొన్నారు.

చెట్టును ఢీ కొన్న లారీ



పాల్వంచరూరల్: ఓ లారీ అదుపుతప్పి ప్రమాదవ శాత్తు రోడ్డు పక్కన చెట్టుకు ఢీ కొనడంతో తృటిలో పెనుప్రమాదం తప్పింది. జగ్గయ్య పేట నుంచి చతీష్‌గఢ్ రాష్ట్రంలోని కుంటకు సిమెంట్ లోడుతో వెళ్తున్న లారీ పాల్వంచ మండల సీతానాగారం కాలనీ సమీపంలో బీసీయం జాతీయ రహదారిపై అదుపుతప్పి రోడ్డు పక్కన డ్రైయినేజీపై నుంచి చెట్లలోకి దూసుకెళ్లింది. దీంతో పెను ప్రమాదం తప్పడంతో స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు.

రేపు ఐఎఫ్‌టీయూ విలీనసభ



సింగరేణి(కొత్తగూడెం): ప్రచార కార్యక్రమంలో ఇఫ్టూ నాయకులు



టేకులపల్లిలో..

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెంలో ఈనెల 18న నిర్వహిస్తున్న ఐఎఫ్‌టీయూ విలీన సభను జయప్రదం చేయాలని ఇఫ్టూ ఉపాధ్యక్షుడు సీతారామయ్య పిలుపునిచ్చారు. సింగరేణి ప్రధాన కార్యాలయం ఎదుట గురువారం ఆయన మాట్లాడుతూ నూతన చట్టాల పేరుతో కార్మికుల హక్కులు కాల రాసే యత్నాలు చేస్తున్న కేంద్రప్రభుత్వ యత్నాలను తిప్పికొట్టేలా రెండు భారత కార్మిక సంఘాల సమాఖ్య(ఇఫ్టూ) యూనియన్లు విలీనం కానున్నాయన్నారు. ఈ మేరకు కొత్తగూడెంలో శనివారం జరిగే ప్రదర్శన, సదస్సును జయప్రదం చేయాలని కోరారు. నాయకులు ఎన్.సంజీవ్, గౌని నాగేశ్వరరావు, మోత్కురి మల్లికార్జున్ రావు, మణెమ్మ, రాధ, నాగలక్ష్మి, కరుణ, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

టేకులపల్లి: కొత్తగూడెంలో నిర్వహించే ఐఎఫ్‌టీయూ విలీనసభను జయప్రదం చేయాలని రాష్ట్ర నాయకులు దుబాకుల ప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి.రాసుద్దీన్ పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం కార్మికులతో కలిసి మండలకేంద్రంలో సభ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వరంగ పరిశ్రమల పరిరక్షణకు ఉద్యమించాలని, ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణ విధానాలను ప్రతిఘటించాలన్నారు. నాయకులు రామారావు, ఉప్పలయ్య, ప్రసాద్, కౌసల్య, ఎర్రమ్మ, లక్ష్మయ్య, మోహన్, రామ, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పండగ ముగిసె.. రద్దీ ఎగసె..



ప్రయాణికులతో రద్దీగా మారిన ఇల్లెందు బస్టాండ్

ఇల్లెందు: సంక్రాంతి పండుగ ముగియటంతో సొంతూళ్లకు వచ్చిన వారు, బంధువుల ఇళ్లకు వచ్చిన వారు తిరుగుపయనమయ్యారు. ఈ మేరకు గురువారం ఇల్లెందు బస్టాండ్ ప్రయాణికులతో కిటకిటలాడింది. గుండాల, మహబూబాబాద్, ఖమ్మం, కొత్తగూడెం వైపునకు వెళ్లే వారితో రద్దీగా మారింది.